క్లుప్తంగా

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

దేవరకొండ : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్, బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. మూడు రోజుల పాటు నకిరేకల్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు శనివారం దేవరకొండ డివిజన్ నుండి ఎస్ఎఫ్ఐ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలు -సవాళ్లపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించేందుకు శిక్షణ తరగతులు ఉపయోగ పడుతాయని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్త రాహుల్,చరణ్, దేవేందర్, సిద్ధు, రాకేష్, శ్రీకాంత్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైద్యశిబిరం

మిర్యాలగూడ టౌన్ : హార్ట్‌ఫెల్‌నెస్ ధ్యాన కేంద్రం రామచంద్ర మిషన్ సహకారంతో ఈనెల 14, 15వ తేదీల్లో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్‌ల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత వైద్యశిబిరాన్ని ఈనెల 14వ తేదీ ఉదయం, ఈ నెల 15న సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉచితంగా ఆయుర్వేదం నాచురోపతి, ఫిజియోథెరపీతో పాటు షుగర్‌కి అయుర్వేదిక మందులను అందించనున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం సెల్ నెంబరు 98668 98466, 94409 07121, 98497 00169ను సంప్రదించాలన్నారు.

దరఖాస్తులు సరిచేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ప్రజాపాలన కింద గృహాజ్యోతి(విద్యుత్) దరఖాస్తులు సరిచేసుకునేందుకు ప్రభుత్వం ఆప్షన్ ఇచ్చినందున పట్టణవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు జీరాక్స్, రేషన్ కార్డు జీరాక్స్‌తో పాటు కరెంటు బిల్లు జీరాక్స్‌లను తీసుకొని మున్సిపాలిటీలో ఇవ్వాలన్నారు. ప్రధానంగా గృహ జ్యోతి, మహాలక్ష్మి(గ్యాస్) నాన్ అప్‌లెడ్ ఉన్నవారికి మాత్రం అప్డేట్ చేసుకునేందుకు అవకాశాం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దెబ్బతిన్న హైట్ గేజ్

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని సాగర్ రోడ్డు రైల్వే బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన హైట్ గేజ్ ఎక్కువ ఎత్తు లోడుతో వెళ్లిన గుర్తు తెలియని వాహనం తగలడంతో దెబ్బతిన్నదని రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైట్ గేజ్ దెబ్బతినడంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగిందని రైల్వే ఇంజనీరింగ్ సిబ్బంది త్వరితగతిన పనులు పూర్తి చేసి తిరిగి రాడ్లను అమర్చి హైట్ గేజ్‌ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. లారీ యజమానులు, డ్రైవర్లు హైట్ గేజ్ కంటేఎక్కువ ఎత్తులో మెటీరియల్ లోడ్‌తో వెళ్లొద్దని కోరారు.

రేపు నేత్ర పరీక్షలు

నల్లగొండ: నల్లగొండలోని పెన్షనర్స్ సామాజిక సేవా భవనంలో మంగళవారం ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించనున్నట్లు పెన్షనర్స్ సంఘం ప్రచార కార్యదర్శి మండడి శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేత్ర పరీక్షలను హన్మకొండలోని శరత్ నేత్ర వైద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లతో పాటు భోజన, రవాణా సదుపాయం కల్పించి గమ్యస్థానాలకు చేరవేస్తారని తెలిపారు.

నీలగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని గొల్లగూడెం నుంచి పెద్దబండ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను శనివారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైపాస్ రోడ్డును రాజకీయం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, గోగుల శ్రీనివాస్, పున్న గణేష్, నాయకులు ఇబ్రహీం, ఖలీల్, సమ్మద్ పాల్గొన్నారు.

సంతల చింత తీరేదెన్నడో !

- రోడ్లపైనే అంగళ్ల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు



త్రిపురారంలో రోడ్డుపైనే నిర్వహిస్తున్న కూరగాయల సంత



గుర్రంపోడులో..

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్వహించే వారాంతపు సంతలు సమస్యలకు నిలయంగా మారాయి. సంతల వల్ల నెలకొన్న సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నా పాలకులకు మాత్రం పట్టడం లేదు. ఎన్నికల సమయంలో హామీలు కురిపిస్తారు తప్ప అమలు మాత్రం చేయడం లేదు. నియోజకవర్గంలోని హాలియా, త్రిపురారం, గుర్రంపోడు మండలాల్లో వారాంతపు సంతలు నిర్వహిస్తారు. అయితే ఆయా మండలాల్లో నిర్వహిస్తున్న కూరగాయల సంతలకు ప్రత్యేకమైన మార్కెట్ సదుపాయం లేకపోవడంతో రోడ్ల వెంట, వీధుల వెంట వారాంతపు సంతలను నిర్వహించడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. త్రిపురారం మండల కేంద్రంలోని మిర్యాలగూడ- దేవరకొండ జాతీయ రహదారికి ఇరువైపులా ప్రతి సోమవారం కూరగాయల సంత నిర్వహిస్తారు. రోడ్డుకు ఇరువైపులా సంతను నిర్వహించడంతో కొనుగోలు దారులు మార్కెట్‌కు రావాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. నిత్యం ఈ జాతీయ రహదారి గుండా వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా కూరగాయల సంత నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు ఉన్నప్పటికీ తరుచూ చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అదే విధంగా హాలియా, గుర్రంపోడు, త్రిపురారం మండల కేంద్రాల్లో నిర్వహించే సంతలకు పలు గ్రామాల వ్యాపారులతో పాటు తిరుమలగిరి, పెద్దవూర, నిడమనూరులకు చెందిన చిరు వ్యాపారులు కూడా వ్యాపారానికి వస్తుంటారు. సంతలో కూరగాయలు కొనుగోలు చేయడానికి రావాలంటే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు భయపడుతున్నారు. పిల్లలను ఆయా మార్కెట్‌లకు పంపించాలంటే నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపైన సంత ఉండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా సంత రోజున పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్డు దాటాలంటే జంకుతున్నారు.

నియోజకవర్గమంతా ఇదే తంతు..

హాలియా మండల కేంద్రంలో ప్రతి ఆదివారం సంతను నిర్వహిస్తారు. దేవరకొండ-మిర్యాలగూడ జాతీయ రహదారికి ఇరువైపులా అంగడి బజార్ వీధుల వెంట సంతను నిర్వహించడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ సంతకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూరగాయలు, ఇతర సరుకులను కొనుగోలు చేయడానికి ఇక్కడకు వస్తారు. అదే విధంగా కూరగాయలు పండించిన రైతులు, చిరు వ్యాపారులు, కూరగాయలు, వస్తువులను అమ్ముకు నేందుకు హాలియా సంతకు వస్తారు. ఇక్కడ మార్కెట్ లేకపోవడంతో ప్రధాన రోడ్డుపైనే వీరు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు కొనసాగిస్తారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. అంతే కాకుండా సంత సాగే సమయంలో వర్షం వస్తే వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నిలబడటానికి కూడా నీడ లేక ఎండల్లో, వానల్లో వ్యాపారులు సతమతమవుతున్నారు. అదే విధంగా గుర్రంపోడు మండలంలో ప్రతి గురువారం నిర్వహించే కూరగాయల సంతకు ప్రత్యేకమైన మార్కెట్ లేకపోవడంతో నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై సంతను నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై సంతను నిర్వహించడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హాలియాలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం గత రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం కాగా ఆ పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి. త్రిపురారం, గుర్రంపోడు మండలాల్లో నిర్వహించే సంతల విషయంపై స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రజలు పలుమార్లు విన్నవించుకున్నా సంతకు సరిపడా స్థలం లేకపోవడం వల్ల తప్పని సరిపరిస్థితుల్లో సంతను రోడ్డుపైనే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా మండలాల్లో రైతు బజారులు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలి



హాలియా పట్టణంలో ప్రతి ఆదివారం సంతను నిర్వహిస్తారు. అంగడి బజార్‌లో రోడ్డుకు ఇరువైపులా సంతను నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు స్పందించి పట్టణంలో చేపట్టనున్న వెజ్, నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విక్రయాలను అక్కడ కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.

– యడవెల్లి రాంబాబు, హాలియా

స్వచ్ఛ మిర్యాలగూడగా తీర్చిదిద్దేందుకు కృషి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు తనవంతుగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల భారిన పడే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్య కార్మికులు డ్రెయినేజీలను శుభ్రం చేయాలన్నారు.రోగుల బారిన పడి ప్రజలకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలన్నారు. తెలంగాణలో మిర్యాలగూడను పారిశుద్ధ్య నిర్వహణలో ముందుండేలా ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పారిశుద్ధ్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో..

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపుమేరకు పట్టణంలోని రవీంద్రనగర్ 10వార్డులో స్వచ్ఛ మిర్యాలగూడ కార్యక్రమాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో చెత్తా చెదారం లేకుండా, డ్రెయినేజీలో నీరు నిల్వ ఉండకుండా పూడికను తొలగించడం జరుగుతుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మురుగు కాల్వల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ గౌస్, బొమ్మగాని దుర్గయ్య, దీక్షిత్, అంజి తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చందంపేట : వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు



మిర్యాలగూడ అర్బన్ : రోగులను పరిక్షిస్తున్న వైద్యులు

చందంపేట : గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి కోరారు. శనివారం చిత్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మారులు జాలె నర్సింహారెడ్డి, తిలక్‌రెడ్డిల సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మండలంలోని చిత్రియాల, పెద్దమూల, రేకులగడ్డ, పెద్దమూల, పొగిళ్ల, కంబాలపల్లి , యల్మలమంద తదితర గ్రామాల ప్రజలు పాల్గొనగా హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆస్పత్రి వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేసింది. ఈ సందర్భంగా జాలె నర్సింహారెడ్డి మాట్లాడుతూ తన తల్లి అండాలమ్మ ఆర్ఎంపీ వైద్యురాలిగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించారని, తన తల్లి జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ ప్రేమలతనర్సింహా, స్థానిక నాయకులు తిరుపతయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, శంకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ, కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి నిరంజన్, క్యాంప్ చైర్మన్ వనం శ్రీనిఆవస్, బందెల తిరుపతయ్య, మల్లయ్య, కాకనూరి వెంకులయ్య పాల్గొన్నారు.

నందిపాడులో..

మిర్యాలగూడ అర్బన్ : శ్రీ బాలాజీ న్యూరో కేర్ మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని నందిపాడులో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ న్యూరో వైద్యులు అభిశేఖ్ రోగులను పరిక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు పోశం సునీతశ్రీనివాస్, మేనేజింగ్ పార్టనర్ చిలుకూరి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బాలునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి : తెలంగాణ రాష్ట్రప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన ప్రెస్ క్లబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కొరకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు జర్నలిస్టులు వారధిగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమలలో జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు పల్లె రవికుమార్, అంగిరేకుల నాగభూసణం, దొంతం సంజీవరెడ్డి, పవన్‌కుమార్, లింగంపల్లి వెంకటయ్య, యాదయ్య, శత్రుఘ్నరాజు, వెంకటయ్యగౌడ్, గోవర్ధన్, నర్సింహారెడ్డి, కిష్టారెడ్డి, సదానందం, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద పరిషత్ మిర్యాలగూడ అధ్యక్షుడిగా మల్లేశ్



మోదాల మల్లేష్

మిర్యాలగూడ టౌన్ : న్యాయవాద పరిషత్ మిర్యాలగూడ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మోదాల మల్లేష్‌ను నియమించారు. శనివారం నల్లగొండ కార్యాలయంలో నిర్వహించిన న్యాయవాద పరిషత్ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్‌రావు ప్రకటించారు. ఈ సందర్భంగా మోదాల మల్లేష్ మాట్లాడుతూ తనను మిర్యాలడూడ న్యాయవాద పరిషత్‌కు అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా సంఘం సహకారంతో తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మోదాల మల్లేష్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. తన నియమకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యులు మేరెడ్డి నర్సింహ్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కాల నాగరాజు, తసంయుక్త కార్యదర్శి దేవులపల్లి శ్రీనివాస్‌చారి, ప్రజాకార్యదర్శి నీల కంఠంహరిరామ కృష్ణలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మోదాల నియామకంపై మిర్యాలగూడ బార్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పంచాయతీ నర్సరీలో ఎండిన మొక్కలు



నర్సరీలో కవర్లలో ఎండిపోయిన మొక్కలు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని జానిగానితండా గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన వన నర్సరీలో మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. ప్రభుత్వం లక్షలు వెచ్చించి ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో వన నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతుంది. ఈ మొక్కలను ఆయా గ్రామపంచాయతీలలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా మొక్కలు పెంచాలని ప్రభుత్వం సూచిస్తుంది. ఈ గ్రామపంచాయతీలో మాత్రం ఈ వన నర్సరీని పట్టించుకున్న దాఖలాలు మాత్రం లేవు. ఈ వన నర్సరీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మొక్కల పెంపకానికి సంబంధించి వాటి యొక్క విలువదాదాపు రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సురేశ్‌ను వివరణ కోరగా మొక్కలు ఎండిపోయిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు. వన నర్సరీపై అధికారులు దృష్టి సారించకపోవడం, కింది స్థాయి సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రజా ధనం వృథా అవ్వడంతో పాటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీఆర్ఓ వ్యవస్థను పునరుద్ధరించాలి



గుత్తాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్: వీఆర్ఓల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి శనివారం నల్లగొండలోని ఆయన నివాసంలో తెలంగాణ గ్రామీణ రెవెన్యూ ఆఫీసర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం తీసుకున్న విధానాల వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. వీఆర్ఓలు లేని కారణంగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు తెలిపారు. ఖరీదైన భూములను భద్రంగా కాపాడామని, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా భూ సమస్య పరిష్కరించామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు జిల్లా వెంకటేశం, లింగయ్య,శ్రీనయ్య, సయ్యద్ హమీద్, సుజాత, సైదులు, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

వేములపల్లి(మాడుగులపల్లి) : అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మాడుగులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని, రైతు భరోసా పథకం కింద రూ.15వేలు అందిస్తామని చెప్పి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నవీన్‌రెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు



పట్టుకున్న రేషన్ బియ్యంతో డీటీసీఎస్

దేవరకొండ : రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని దేవరకొండ సివిల్ సప్లయ్ అధికారి హన్మంతు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం ఉదయం దేవరకొండ పట్టణంలో రేషన్ బియ్యాన్ని ఆటోలో అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేసి 6 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ బియ్యాన్ని నాగర్‌కర్నూలు జిల్లా చారగొండకు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దేవరకొండ పరిధిలో కొంతమంది రేషన్ డీలర్లు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించా రు. కార్డుదారులు బియ్యాన్ని విక్రయిస్తే కార్డులు రద్దు చేస్తామని ఆయన తెలిపారు. రేషన్ దుకాణాలపై నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

కన్నెకల్‌లో ప్రబలుతున్న విష జ్వరాలు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

వేములపల్లి (మాడుగులపల్లి): మాడుగులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలో 20 రోజులుగా ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. స్థానిక పల్లె దవాఖానా వైద్యులు ఇంటింటికి తిరిగి మందులు పంపిణీ చేసినా తగ్గకపోవడంతో నల్లగొండ, మిర్యాలగూడ వంటి పట్టణాల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నా నెగిటివ్ రిపోర్టులు రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలో 1200 మంది జనాభా ఉండగా సుమారు వంద మంది ప్రజలు జ్వరాలు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నప్పటికీ వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి గ్రామంలో ప్రత్యే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల సమస్యలు పరిష్కరించండి

- సీఎం రేవంత్‌కు మినా కళాశాలల చైర్మన్ మహమ్మద్ అలీ వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహమ్మద్‌అలీ

మిర్యాలగూడ : రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మహమ్మద్‌అలీ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య' అనే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కాగా మహమ్మద్‌అలీ సీఎంను కలిసి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వినతిపత్రం అందజేశారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఫీజు బకాయిలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని కళాశాలల యాజమాన్యాలకు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ప్రారంభమైన మొహర్రం వేడుకలు

చింతపల్లి : మండల కేంద్రంతో మండలంలోని గ్రామాల్లో ఆసర్‌ఖానాలు ముస్తాబవుతున్నాయి. మొహరం వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి పీర్ల ప్రతిష్ఠ, ఆదివారం చినసరిఎత్తు, మంగళవారం పెద్ద సరిఎత్తు, బుధవారం నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు మండలకేంద్రంలోని ఆసర్‌ఖానాలతో పాటు గడియగౌరారం, నెల్వలపల్లి, నసర్లపల్లి, వింజమూరు, కుర్మేడు, సాయిరెడ్డిగూడెం, పోలేపల్లి రాంనగర్, గొడుకొండ్ల గ్రామాల్లోని అషర్‌ఖానాలు ఇప్పటికే ముస్తాబయ్యాయి. కాగా వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.



చింతపల్లిలో ఆసర్‌ఖానాలో కొలువుదీరిన పీర్లు

ఉద్యమకారులకు రూ.25 వేల గౌరవవేతనం ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : 2001 నుంచి 2014 సంవత్సరం వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమించిన వారికి హెల్త్‌కార్డులు, బస్‌పాస్‌లు, నెలకు 25 వేల పింఛన్ ఇవ్వాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణశాఖ మంత్రి పొన్నంప్రభాకర్‌కు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్‌ముస్తఫా వినతిపత్రాలను అందజేశారు. అలాగే 250 గజాల ఇంటి స్థలం, ఉపాధి కోసం రుణాలను మంజూరి చేయాలని కోరారు. ఉద్యమంలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు 10లక్షల రూపాయల పరిహారంచెల్లించాలని కోరారు.

ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర



జగన్నాథస్వామి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ : భక్తివేదాంత ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో చేపట్టిన జగన్నాథ స్వామివారి రథయాత్రను శనివారం పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల గుండా నిర్వహించిన స్వామివారి రతయాత్రకు భక్తులు మంగళహారతి, పూజలు, కీర్తనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భార్గవ్, పరమహంస ప్రభుజి పాల్గొన్నారు.

గీత కార్పొరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని వినతి

నల్లగొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జిల్లా గౌడ సంఘం ప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేశారు. శనివారం గౌడ విద్యార్థి వసతిగృహంలో మంత్రులు మాజీ ఎంపీ ధర్మభిక్షం విగ్రహానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మంత్రులను జిల్లా గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి కాశయ్యగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల శంకర్‌గౌడ్, కటికం సత్తయ్యగౌడ్, సురిగిమారయ్యగౌడ్, రేగట్టే సైదులు, కొప్పుకృష్ణా, బండారు గోవర్ధన్, సురిగియాదగిరి, కొండ జానయ్య, పుల్లెంల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.